తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం
సూర్యపేట
యాద్రాద్రి భువనగిరి
బుధవారం
06 ఆగష్టు 2025
పేజీలు : 8
Follow :

# విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

## కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సాధారణ ప్రసవాలు,ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్ల సంఖ్యను పెంచాలి

## కస్తూరిబా లో పాఠశాల పారిశుద్ధ్యం, విద్య, భోజనం, వసతి సౌకర్యాల పరిశీలన : నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**మర్రిగూడ, ఆగస్టు 5( జనంసాక్షి)**
కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సాధారణ ప్రసవాలు,ఇన్ పేషెంట్లు, అవుట్ పేషెంట్ల సంఖ్యను పెంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.మంగళవారం ఆమె నల్గొండ జిల్లా ,మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డయాలసిస్ యూనిట్ ను ఇతర విభాగాలను సందర్శించి ఆస్పత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.ఆస్పత్రిలో ఉన్న మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఓపి ,ఐపి రిజిస్టర్ లను ,ఏఎన్ సి రిజిస్టర్ లు తనిఖీ చేశారు .ఎక్స్ రే ప్లాంట్ పనితీరును అడిగి తెలుసుకున్నారు. కాగా ఎక్రే ప్లాంట్ యూనిట్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ నిధులనుండి నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఐపి, ఇన్ పేషెంట్ల సంఖ్య అవుట్ పేషంట్ల సంఖ్యను పెంచాలని, అదేవిధంగా సాధారణ ప్రసవాలు సైతం పెంచాల్సిన అవసరం ఉందని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల పారిశుద్ధ్యం, విద్య, భోజనం, వసతి సౌకర్యాలను పరి శీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని, అంతే కాకుండా నాణ్యమైన భోజనంతో పాటు ,గునాత్మక విద్యను అందించా లని ఆదేశించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ మాతృనాయక్, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తాసిల్దార్ జక్కర్తి శ్రీనివాస్ ఇతర అధికారులు ,ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం డాక్టర్లు ,తదితరులు ఉన్నారు.





# భూ సమస్యలను పరిష్కరించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
భూ భారతి అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అన్నారు.మంగళవారం సూర్యాపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూభారతి అర్జీలపై అధికారుల బృందాలు గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్నారు. అర్హులకు నూతన రేషన్ కార్డులను కూడా త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు.తహసీల్దార్ భూ భారతి రెవిన్యూ సదస్సుల ద్వారా 1758 అర్జీలు వచ్చాయని, 369 అర్జీలను ఎంక్వయిరీ చేశామని, వాటిలో 34 అర్జీలను పరిష్కరించడం జరిగిందని అన్నారు.మిగిలిన వివిధ దశలో ఉన్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్.కృష్ణయ్య, డిటి లావణ్య, సీనియర్ అసిస్టెంట్ కపిల్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యాన్ని పక్కదోవ పట్టిస్తే కఠిన చర్యలు

## ఎస్ఐ అజ్మీరా రమేష్

**కొండమల్లేపల్లి, ఆగస్టు 5 (జనంసాక్షి):**
ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత రేషన్ సన్న బియ్యం నిరుపేదల కడుపు నింపడానికి ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న రేషన్ సన్న బియ్యాన్ని కొంతమంది వ్యాపారులు పక్కదారి పట్టిస్తూ ప్రభుత్వ ఆశయానికి గండి పడడంతో పాటు నిరుపేదలను నిలువు దోపిడీ చేస్తూ దళారులు నూతన పద్ధతుల ద్వారా రేషన్ సన్న బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ఎస్ఐ అజ్మీరా రమేష్ అన్నారు. మంగళవారం మాల్ గ్రామానికి చెందిన జర్పుల వెంకటేష్ పెద్దవూర మండలంలోని గ్రామాలలో పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా జమచేసి తరలిస్తుండగా మండల కేంద్రంలో సుమారు ఐదు క్వింటాలు బియ్యాన్ని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం అక్రమంగా బియ్యం తరలిస్తున్న వ్యక్తి పైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఉచిత రేషన్ సన్న బియ్యాన్ని ఎవరైనా పక్కదోవ పట్టిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.



# డ్రగ్స్ రహిత గోడపత్రికల ఆవిష్కరణ

**చౌటుప్పల్, ఆగస్టు 5(జనం సాక్షి ):**
డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగంగా యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సామాజిక చైతన్య కార్యక్రమంలో భాగంగా రూపొందించిన మిత్రమా మేలుకో మత్తుని కాదు, జీవితాన్ని ఎంచుకో గోడపత్రికలను జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ జి. వీరారెడ్డి కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డ్రగ్స్ వాడకం మన వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా, కుటుంబాన్ని కూడా నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యజ్ఞ ఫౌండేషన్ చేస్తున్న ఈ ప్రయత్నం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాలెం వెంకటేష్, యాట మహేందర్, పంతంగి రంజిత్ కుమార్, ఎర్రబోయిన శ్రీను, ఉదయ్ కిరణ్, భూమిక తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ సిబ్బందిని అభినందించిన ఎస్పీ నరసింహా



సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
ఈనెల 1, 2వ తేదీలలో వరంగల్ జిల్లా మామునూరు పోలీస్ ట్రైనింగ్ సెంటర్ నందు జరిగిన తెలంగాణ రాష్ట్ర రెండవ పోలీస్ డ్యూటీ మీట్ నందు యాదాద్రి జోన్ తరపున సూర్యాపేట జిల్లా పోలీసులు పాల్గొన్నారు.శాస్త్ర సాంకేతికత దర్యాప్తు నందు నిర్వహించిన పోటీల్లో హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ చక్రవర్తి తృతీయ స్థానంలో మెడల్ సాధించారు.ఈ పోటీల నందు నార్కోటిక్ డాగ్ రొలెక్స్ ఉత్తమ ప్రతిభ చూపి మత్తు పదార్థాల తనిఖీల నందు ద్వితీయ స్థానం మెడల్ సాధించగా డాగ్ ట్రైనర్ సతీష్ ఉత్తమ ప్రతిభ చూపారు.ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ కళ్యాణ చక్రవర్తి, ఆర్మడ్ కానిస్టేబుల్ సతీష్ ను జిల్లా ఎస్పీ నరసింహ అభినందించారు.పూణే పట్టణంలో జరగనున్న జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్ నందు ప్రతిభ చూపి పతకాలు సాధించాలని, రాష్ట్ర పోలీస్, జిల్లా పోలీస్ శాఖలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, ఏఆర్ డీఎస్పీ నరసింహచారి తదితరులు పాల్గొన్నారు.

# వేణు మరణం సిపిఎం పార్టీకి తీరని లోటు





## వేణు పాడేమోసి అంత్యక్రియలలో పాల్గొన్న శశిధర్ రెడ్డి

**వేములపల్లి ఆగస్టు 5 (జనంసాక్షి):** కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ముందుండి పనిచేసే నల్లబోతు వేణు ఆకస్మిక మరణం సిపిఎం పార్టీకి తీరని లోటని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ , సిపిఎం మండల కార్య దర్శి పాదూరి శశిధర్ రెడ్డి, వేముల పల్లి మాజీ వైస్ ఎంపీపీ,ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన లు అన్నారు. వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ నాయకుడు కామ్రేడ్ నల్లబోతు వేణు అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బి కార్ మల్లేష్, సిపిఎం పార్టీ వేములపల్లి మండలకార్యదర్శి పాదూరు శశిధర్ రెడ్డి, ఐద్వాజిల్లాసహాయకార్యదర్శి పాదూరి గోవర్ధన, మంగళ వారం వేణు పార్థివ దేహన్ని సందర్శించి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళ్ళ ర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సాను భూతి ని తెలియజేయజేశారు. అనంతరం వేణు అంతిమ దహన సంస్కారాలలోపాల్గొన్న సిపిఎం నాయకులు పాడేమోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరుశరాములు సిపిఎం మాడ్గులపల్లి మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ సిపిఎం పార్టీ నాయకులు జేరిపోతుల బిక్షం,తదితరులు పాల్గొన్నారు.



# లెవీని త్వరగా పూర్తి చేయండి..!

## పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిటి మాచన రఘునందన్

**పి.ఏ.పల్లి,ఆగష్టు 05(జనంసాక్షి)** మిల్లర్లు లెవీని త్వరగతిన పూర్తి చేయాలని పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్ మెంట్ డిటి మాచన రఘునందన్ స్పష్టం చేశారు. మంగళవారం నాడు ఆయన పి.ఏ.పల్లి లో ఉన్న గణేష్ రైస్ మిల్లు ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రఘునందన్ మాట్లాడుతూ కనీస మద్దతు ధర తో కొన్న వడ్లను సాధ్యమైనంత త్వరగతిన లెవీ పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని నిర్దేశించారు. మిల్లులో ఉన్న ధాన్యం పరిమాణాన్ని పరిశీలించారు. ఎంత ధాన్యం మిల్లుకు చేరింది,ఎంత మేర మర ఆడించారు అనే వివరాలను మిల్లర్ అలుగుబెల్లి శ్రీనివాస్ రెడ్డి ని అడిగి తెలుసుకున్నారు.

# కాళేశ్వరం పేరుతో కెసిఆర్ పై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు ప్రచారం

## తాటికొండ సీతయ్య.. మాజీ ఎంపీపీ



**తుంగతుర్తి ఆగస్టు 5 (జనంసాక్షి)** రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కాళేశ్వరం కమిషన్ పేరుతో టిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ పై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయనను వేధించాలని చుస్తే ప్రజా క్షేత్రం లో ప్రతిఘటన తప్పదని మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య హెచ్చరించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాలేశ్వరం కమిషన్ పై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఘోష్ కమిషన్ పూర్తి నివేదిక ను ప్రజలకు అందుకు బాటులో ఉంచాలని అన్నారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక పూర్తి సారాంశాన్ని ప్రజలకు తెలియపర్చకుండా ప్రభుత్వం చెప్పదలుచుకున్న విషయాన్నే నివేదిక పేరుతో క్యాబినెట్ ప్రెస్ మీట్ లో ముఖ్యమంత్రి ప్రకటించాడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. నివేదిక ప్రకారం కెసిఆర్ కానీ కాని. హరీష్ రావు. కాని ఎక్కడ అవినీతికి పాల్పడినట్లు మీరు చెప్పిన దాంట్లో లేదని. అలాంటప్పుడు మీరు ఏవిధంగా వేధించే విధంగా తప్పుడు ప్రకటనలు చేస్తారని అన్నారు. ఎన్నికల ముందు మిరిచ్చిన ఆరు గ్యారాంటిలను రెండేళ్లు కావస్తున్న ప్రజలకు అందించ లేక ప్రజల్లో మీమీద ఉన్న అసంతృప్తి ని.. ప్రశ్నించే తాత్వాన్ని పక్క దారి పట్టించి కాల యాపన చేయడం కోసం కాళేశ్వరం కమిషన్ నివేదిక ను ముందు పెట్టారని అన్నారు.. మీరు ఎలాంటి అనుమతులు లేవని చెప్పిన అన్నింటికి రుజువులతో ఈ రోజు మాజి నీటిపారుదల మంత్రి వర్యులు ప్రజలకు. మీకు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియ పర్చడం జరిగిందన్నారు కావున ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు నిజా. నిజాలు ప్రజలకు తెలియ చెప్పాలని డిమాండ్ చేస్తున్నాం. ఈ సమావేశం లో పట్టణ అధ్యక్షులు గోపగాని శ్రీనివాస్. టిఆర్ఎస్ మండల నాయకులు గోపగాని రమేష్. తడకమళ్ల రవికుమార్. గోపగాని వెంకన్న. నల్లబెల్లి వెంకటేష్. తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి

## కల్లాడ కేదారి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు

**తుంగతుర్తి ఆగస్టు 5 (జనంసాక్షి)** సమాజంలో ప్రతి ఒక్కరు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని తుంగతుర్తి లైన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు తల్లాడ కేదారి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంతోష్ ప్రైవేట్ దవాఖానాలో సూర్యాపేట జిల్లా మాజీ గవర్నర్ కోనేరు నాగేశ్వరరావు వర్ధంతిని పురస్కరించుకొని ప్రస్తుత గవర్నర్ రేపాల మదన్మోహన్ ఆదేశాల మేరకు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సమాజంలో ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా పేదలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ కోశాధికారి గుండ గాని రాము, కోఆర్డినేటర్లు ఓరుగంటి శ్రీనివాస్ ఎనగందుల సంజీవ ఎనగందుల గిరి డాక్టర్ వైలెన్ చారి, పులుసు వెంకటనారాయణ, ఓరుగంటి సుభాష్ ,గుజ్జ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి 5000 రూ ఆర్థిక సాయం

**తుంగతుర్తి ఆగస్టు 5 (జనంసాక్షి)** మండల కేంద్రానికి చెందిన తడకమళ్ళ రాములమ్మ క్యాన్సర్ తో బాధపడుతూ మూడు సంవత్సరాల క్రితం చెందగా ఇటీవల ఆమె భర్త తడకమళ్ళ వెంకన్న అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు దీంతో వారి ఇద్దరు ఆడపిల్లలు అనాధలుగా దిక్కుతోచని పరిస్థితిలో ఉండగా విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ పార్టీ నాయకులు స్పందించి మృతుడి కుటుంబానికి టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య, బిఆర్ఎస్ మండల నాయకులు గోపగాని రమేష్, గోపగాని శ్రీనివాస్, తడకమళ్ళ రవికుమార్, బొంకూరీ శ్యాంసుందర్, తడకమళ్ళ భిక్షం, బొంకూరీ మల్లేష్ , గోపాగని వెంకన్న, కొండగడుపుల శ్రీకాంత్, బొంకూరి శ్రీను, పోలెపాక రాజేష్, పోడేటి లతిప్, కడియం గోపి, కొండగడుపుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని విషయాలూ అసెంబ్లీలో చర్చిస్తాం

## బిఆర్ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ
## బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
## మంత్రి పొంగులేటి ఘాటు హెచ్చరిక

**ఖమ్మం(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్ఎస్ నేతలు జనంలోకి వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని బిఆర్ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ–, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుఫున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు–జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

# కరెంట్ షాక్‌తో వ్యక్తి సజీవ దహనం

గుండాల, ఆగస్టు 5 (జనంసాక్షి) :



గుండాల మండలంలోని వెన్నెలబైలు గ్రామానికి చెందిన యువ రైతు పొలానికి వెళ్తున్న సమయంలో విద్యుదాఘాతంతో సజీవ దహనం అయిన సంఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెన్నెలబైలు గ్రామానికి చెందిన పర్శిక రాజు(28) గ్రామ సమీపంలో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. కాగా తెల్లవారుజామున కోతుల కాపలా కోసం ద్విచక్రవాహనంతో వెళ్తున్నాడు. చేనులోకి వెళ్లే క్రమంలో రోడ్డు దిగాడు. అప్పటికే శంభునిగూడెం వైపే వెళ్లే విద్యుత్ తీగ తెగిపడింది. దీంతో మెడకు తగిలి షార్ట్ ద్విచక్ర వాహనంతో పాటు కిందపడ్డాడు. వెంటనే మంటలు చెలరేగి అక్కడిక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనంతో పాటు అతడు పూర్తిగా కాలిపోయాడు. అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి గ్రామస్తులకు సమాచారం అందించగా మంటలో కాలిపోతున్న అతన్ని చూసిన కుటుంబ సభ్యులు బోరున విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇలందు తరలించారు. మృతునికి భార్య కొడుకు, కూతురు ఉన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ఉందని గ్రామస్తులు ఆరోపించారు. వెన్నెలబైలు నుంచి శంభునిగూడెం, చెట్టుపల్లి గ్రామాలకు విద్యుత్ మెయిన్ లైన్ వెళ్తుంది. అయితే స్తంబంపై ఇన్సులేటర్ ఫెయిల్ కావడంతో తీగ తెగిపడింది. నేలపై తీగ పడకపోవడంతో కరెంట్ ట్రిప్ కాలేదు. ఈ క్రమంలోనే వేలాడుతున్న తీగ అతని మెడకు తగిలి ప్రమాదం జరిగింది. ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయాల్సిన అధికారులు చేయకపోవడంతో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు ఆరోపించారు. వర్షాకాలంలో అప్పుడప్పుడు ఇన్సులేటర్లు ఫెయిల్ అవుతాయని, ఉడుతలు సైతం తీగలను పాడు చేస్తాయని ఏడీఏ కోటేశ్వరావు తెలిపారు. ఎక్స్ గ్రేషియా వచ్చేలా కృషి చేస్తామని అన్నారు.

# పాలకుల అవినీతి పాపమే పేదరికం

## బి కే యం యు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణ కుమార్..



ఖమ్మం రూరల్, ఆగష్టు 05:(జనం సాక్షి)

పాలకుల అవినీతి అక్రమ సంపాదన లంచగొండితనంతో దేశంలోని నలభై శాతం జనాభా ఒక్కపూట కడుపునింపుకొని, రెండు పూటలు ఆకలితో అలమటిస్తూన్న పేదరికంలో మగ్గుతున్నారని బి కే ఎమ్ యు జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దినేని కర్ణకుమార్ అన్నారు. ఖమ్మం జిల్లా సమితి ఇచ్చిన జిల్లా వ్యాప్త పిలుపు మేరకు ఖమ్మం రూరల్ రెవెన్యూ కార్యాలయంలో వ్యవసాయ కార్మికుల సమస్యలుపై ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని తహసిల్దార్ రాంప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రధాన భూమిక పోషించేది వ్యవసాయ కార్మికులేనని వారి పట్ల కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీస సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని ఆయన అన్నారు. తక్షణమే ప్రభుత్వాలు స్పందించి వ్యవసాయ కూలీ మహిళలందరికీ ఆత్మీయ భరోసా ద్వారా సంవత్సరానికి 12,000 ఇవ్వాలని 50 సంవత్సరాలకే వృద్ధాప్య పెన్షన్ 6000 ఇవ్వాలన్నారు. వృద్ధాప్య వికలాంగ పెన్షన్లు పెంచుతామన్న ప్రభుత్వ హామీలు నిలబెట్టుకోవాలన్నారు. పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఒకే విడతలో ఇవ్వాలని ఇంటి స్థలం లేని వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు సహజ అసహజ ప్రమాద మరణాలకు గురైన వారికి ఐదు లక్షల రూపాయలు బీమా వర్తించే విధంగా ప్రభుత్వ పథకం అమలు చేయాలని భూమిలేని వ్యవసాయ కూలీలకు కూలి భరోసా సంవత్సరానికి 40,000 ఇచ్చి ఆదుకోవాలని. భూమిలేని పేదలకీ ప్రభుత్వ భూములను గుర్తించి భూ పంపిణీ చేయాలన్నారు. పేద ప్రజలందరికీ రేషన్ షాప్ ద్వారా నెలకు సరిపడా నిత్యవసర సరుకులు బియ్యం పంపిణీ చేయాలని. పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని. వ్యవసాయ కూలీలందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించే విధంగా ప్రభుత్వం భరోసా ఇవ్వాలని వ్యవసాయ కూలీలను పేద ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలది అని పాలకులు గుర్తు ఎరగాలని ఆయన అన్నారు. దోపిడీ లేని నవ సమాజం కోసం పేద ప్రజలు పోరాటాలు నిర్వహించాలని అప్పుడే పేదరికం లేని సమాజం ఏర్పడుతుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి బత్తిని సీతారాములు. జిల్లా నాయకులు బట్టు బాబురావు. మండల నాయకులు బండి మాధవరావు. దాసరి పున్నయ్య. కళ్లెం ముత్తయ్య. కొత్తకొండ సీతారాములు. మోటాం సైదులు తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డాక్టర్ రాజేష్

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పిచ్చి మొక్కల తొలగింపు





పెన్ పహాడ్ ఆగష్టు 05 (జనం సాక్షి) :

మన చుట్టూ ఉన్న పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ధారావత్ రాజేష్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే ను పురస్కరించుకొని పచ్చదనం పరిశుభ్రత లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఆశా కార్యకర్తలు, సిబ్బందితోపాటు పిచ్చి మొక్కలను తొలగించి మాట్లాడారు. ఈ వర్షాకాల సీజన్లో దోమలు వ్యాప్తి చెందకుండా వ్యాధులు బారిన పడకుండా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామాలలో తెలియజేయడమే కాకుండా ఆసుపత్రి ఆవరణంలో కూడా పరిశుభ్రతపై దృష్టి సారించాలని తెలిపారు. గ్రామాలలో ఆరోగ్యకర మైన వాతావరణం నెలకొల్పడానికి ఆశలు ముఖ్యపాత్ర పోషించాలని, అదేవిధంగా ఉపకేంద్రాల్లో డాక్టర్లు ఏఎన్ఎం లు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని సూచించారు. విష జ్వరాల బారిన పడిన రోగులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఓ తాడూరు వెంకన్న, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం లు, ఆయా గ్రామాల ఆశ కార్యకర్తలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు...

## దళితులకు 3 ఎకరాలు పంపిణీలో

# అసలైన లబ్ధిదారులకు అన్యాయం

✧ నష్టపోయిన దళితులకు న్యాయం చేయాలి ✧ దీక్షలో కూర్చున్న దళితులకు సంఘీభావం తెలిపిన ✧ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందుల




చింతకాని, ఆగష్టు 05 (జనంసాక్షి)

దళితులకు మూడు ఎకరాల పంపిణీ చేసిన విషయంలో నిజమైన అర్హులకు అన్యాయం జరిగిందని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందుల వెంకయ్య తెలిపారు. మంగళవారం మండల ఏర్పాటు చేసిన దీక్ష కార్యక్రమానికి సంఘీభావం తెలిపి వారు మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి పంపిణీ లో అసలైన లబ్ధిదారులకు అన్యాయం జరిగిందని ఫైర్విచార్లు కొంతమంది గ్రామ పెద్దల సహకారంతో గ్రామంలోని 60 మంది నిరుపేద కుటుంబాలకు రావలసిన భూమిని కొద్ది మంది పేరుతో అక్రమంగా రెవిన్యూ రికార్డులు చేయించుకున్నారని అట్టి భూమి సమిష్టిగా సేద్యం చేసుకోవడం కోసం ఒప్పందంతో ప్రభుత్వం చింతకాని గ్రామ దళితులకు 24 ఎకరాలు భూమి పంపిణీ చేసిందని అట్టి భూమిని దళితుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని కొద్ది మంది అనుభవిస్తున్నారని న్యాయంగా మొత్తం దళిత కుటుంబాలకు ఆ భూమి పంపిణీ జరగాలని అందుకోసం ఈరోజు మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించినారు ఈ ధర్నాని సంఘీభావంగా అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బందుల వెంకయ్య జిల్లా అధ్యక్షులు రేపాకుల శివలింగం సందర్శించి వారి సమస్యలను పరిశీలించి వారి న్యాయమైన పోరాటానికి సంఘీభావం ప్రకటించినారు అనంతరం మండల తాసిల్దార్ని సమస్య మీద కలిసినారు ఈ ధర్నా చేస్తున్న దళితుల దగ్గరకు వచ్చి తాసిల్దార్ మీ సమస్యని ఉన్నత అధికారులకు విన్నవించామని వారి నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం మీ భూమి పంపిణీ జరుగుతుందని అంతవరకు ఇరువర్గాలు శాంతి భద్రతల సమస్య సృష్టించద్దని ఆ భూమి వారి పైకి ఇరువర్గాలు వెళ్లవద్దని చెప్పినారు దళితులు మాకు భూమి వచ్చేంతవరకు నిరాహార దీక్ష చేస్తామని తమ దీక్షను కొనసాగిస్తున్నారు.

# ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



**మధిర, ఆగస్టు 05 జనంసాక్షి :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేయాలని సిపిఐ అనుబంధ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం(బి కె ఎం యు) జిల్లా కార్యవర్గ సభ్యులు కొండూరి నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం వ్యవసాయ కార్మికుల సమస్యలపై వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, సిపిఐ మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు తో కలిసి మధిర డిప్యూటీ తాహశిల్దార్ కి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా నాగేశ్వరావు మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతు లేకుండా వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి రూ. 12,000 వెంటనే అమలు చేయాలని,ఉపాధి హామీ ఎన్.ఆర్.ఇ.జీ.ఎస్ లో పనిచేసిన వారే అర్హులనే ప్రభుత్వా నిబంధనలను ఉపసంహరించుకోవాలన్నారు.అలాగే వ్యవసాయ కార్మికులకు 50 సంవత్సరాలు దాటితే 6000 రూపాయలు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలన్నారు.ప్రస్తుతం పెన్షన్ లబ్ధిదారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ 2000 వృద్ధాప్య పెన్షన్ 4000 రూపాయలకు పెంచుతామని, వికలాంగుల పెన్షన్ 3000 రూపాయలను 6 రూపాయలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు.ఇంద్రమ్మ ఇండ్లు ప్రజాపాలన సదస్సులో ఇచ్చిన దరఖాస్తుతో సహా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని,సహజ ఆసహజ ప్రమాదాలకు గురై మరణించిన వ్యవసాయ కార్మిక కుటుంబాలకు 5 లక్షల రూపాయలు చెల్లించే విధంగా బీమా పథకం ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మంగళగిరి రామాంజనం, తలారి రమేష్,జల్లా బ్రహ్మం, అన్నవరపు సత్యనారాయణ,పున్నవల్లి అప్పారావు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.





## 33కెవి విద్యుత్ లైన్ ప్రారంభించిన జిల్లా విద్యుత్ శాఖ అధికారి శ్రీనివాస చారి

**కల్లూరు ఆగస్టు 05(జనంసాక్షి)**
కల్లూరు నుండి 33/11కె.వి. బత్తులపల్లి విద్యుత్ ఉపకేంద్రము నకు సుమారు రూ. 39 లక్షల అంచనా వ్యయముతో చేపట్టి పూర్తిచేసిన 33 కె.వి. లైను ను ఖమ్మం జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఇనుగుల శ్రీనివాస చారి మంగళవారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎస్ ఇ ఇనుగుల శ్రీనివాస చారి మాట్లాడుతూ కొత్తగా ఏర్పాటు చేసిన 33 కె.వి. లైను వలన 33/ 11కె.వి. బత్తులపల్లి విద్యుత్ ఉపకేంద్రము పరిధి లోని 10 గ్రామములకు సంబంధించిన సుమారు 3000 మంది విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయములు తగ్గటమే కాక విద్యుత్ సరఫరా లో ఓల్టేజి మెరుగు పడటం వలన వినియోగదారులకు మెరుగైన నాణ్యమైన విద్యుత్ అందనున్నట్లు తెలిపారు. .ఈ కార్యక్రమము లో సత్తుపల్లి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ లునావత్ రాములు, కల్లూరు సహాయ ఇంజనీర్ పి. వెంకట్ కల్లూరు విద్యుత్ శాఖ సిబ్బంది బత్తుల సత్యనారాయణ, ఉస్మాన్ బేగ్ ,మురళీకృష్ణ, బత్తులపల్లి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహా పూర్ణాహుతితో ముగిసిన పవిత్రోత్సవాలు

### శ్రీనివాసునికి 108 కలశ అభిషేక మహోత్సవం

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
జిల్లా కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో గత మూడు రోజులుగా జరుగు తున్న పవిత్రోత్సవ కార్యక్రమాలు మంగళవారం ఘనంగా ముగిశాయి.తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవతో ప్రారంభమైన కార్యక్రమాలు సాయంత్రంతో ముగిసాయి. యాగశాలలో ద్వార తోరణ ధ్వజ కుంభ ఆరాధనలు, మూల మంత్ర హెూమములు యజ్ఞచార్యులు హరిచరణ్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించి మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం శ్రీవెంకటేశ్వర స్వామి వారికి 108 కలశములతో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పండ్ల రసాలు, ఇతర సుగంధ ద్రవ్యములతో తిరుమంజన స్నపనం అభిషేకం నిర్వహించి యజమానులకు పవిత్ర మాలలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్న ప్రసాదం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణు గోపాలా చార్యులు, సంకర్షణచార్యులు,



శ్రీహరిచార్యులు, ఫణి కుమార్ ఆచార్యులు, రాఘవాచార్యులు, రామానుజాచార్యులు, కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరెడ్డి, కార్యాలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# దండి సురేష్ నిబద్ధతకు గౌరవం దక్కింది

✧ శ్రీ సిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు..

✧ ప్రగతి కో-ఆపరేటివ్ ఆటోనగర్లో ఘన సన్మానం..

**ఖమ్మం రూరల్, ఆగస్టు 05:(జనంసాక్షి)**
ఎత్తిన ఎర్రజెండాను దించకుండా.. మూడు దశాబ్దాలుగా దండి సురేష్ చూపిన నిబద్ధతకు జిల్లా కార్యదర్శి బాధ్యత లభించడం ఎంతో గర్వకారణం అని శ్రీ సిటీ చైర్మన్ గరికపాటి వెంకట్రావు అన్నారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్డులో గల ప్రగతి కో-ఆపరేటివ్ ఆటోనగర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటోనగర్ ఏర్పాటులో నాటి మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రస్తుత సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు చేసిన కృషి ఎనలేనిది అన్నారు. అదేవిధంగా ఇక్కడి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో దండి దండి సురేష్ సహకారం మద్దతు సాధ్యమైనట్లు తెలిపారు. కార్మిక , కర్షకుల పట్ల భారత కమ్యూనిస్టు (సిపిఐ) పార్టీకి ఉన్న అంకితభావంతో ఆటోనగర్ నిలబడిందన్నారు. ఆటోనగర్లో సమస్యలను పరిష్కరించడంలో తోడ్పాటున అందించాలని ఆయనను కోరారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ గంగవరపు రామకృష్ణ, డైరెక్టర్లు కూచిపూడి కృష్ణారావు, కోలా రాము , వేణుగోపాల్ ,పల్లపు గోవింద్ ,బుర్ర ఉప్పలయ్య ,మహమ్మద్ యాసీన్ ,పాలడుగు కృష్ణ, ప్రేమ్చంద్ కోశాధికారి హరిలాల్ పటేల్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, మండల సమితి సభ్యుడు దండి రంగారావు, సిపిఐ సోషల్ మీడియా సభ్యులు రెబ్బగొండ్ల గోపి, శివ, మెకానిక్ షెడ్ల ఓనర్లు, కార్మికులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

**అస్వస్థకు గురైన విద్యార్థులను పరామర్శించిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్**

**కల్లూరు ఆగస్టు 05 (జనంసాక్షి)**
అస్వస్థత గురై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందుతున్నకల్లూరు లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని లను రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం పరామర్శించారు. సోమవారం సుమారు 40 మంది విద్యార్థులు ఉదయం అల్పాహారంలో భాగంగా కిచిడి తిని ఫుడ్ పాయిజన్ తో వాంతులు కడుపునొప్పి తో అనారోగ్యం పాలే కల్లూరు లోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందారు. మంగళవారం ఉదయం నలుగురు విద్యార్థులు అల్పాహారం తిన్న తర్వాత అస్వస్థతకు గురి కావడంతో వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పలువురు విద్యార్థులను మంగళవారం పరామర్శించారు. స్వతహాగా వైద్యులైన మట్టా దయానంద్ స్టెతస్కోప్ పట్టుకొని విద్యార్థులను పరీక్షించారు. ఎటువంటి ఇబ్బంది లేదని ఆందోళన చెందవలసిన అవసరం లేదని ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి వైద్యులకు అస్వస్థతకు గురైన విద్యార్థులకుమెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అదేవిధంగా ఫుడ్ పాయిజన్ తో సోమవారం ఆసుపత్రిలో చేరిన సుమారు 40 మంది విద్యార్థులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించి వారు సంపూర్ణ ఆరోగ్యంగా కోలుకునే విధంగా కృషి చేసినందుకు వైద్యులు డాక్టర్ నవ్య కాంత్, డాక్టర్ రమేష్, ఆసుపత్రి వైద్య సిబ్బందిని అభినందించారు.





అనంతరం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థుల పట్ల ప్రేమ పూర్వకంగా వ్యవహరిస్తూ నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసిడాక్టర్ దయానంద్, తాసిల్దార్ పులి సాంబశివుడు, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, పలువురుకాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్రావు ఏనుగు సత్యంబాబు, లక్కినేని కృష్ణ తదితరులు సామూహికంగా భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పలువురు అధికారులు వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఆనంద్ ఔదార్యం

❑ 65 నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు వితరణ



**కల్లూరు ఆగస్టు 05 (జనంసాక్షి)** కల్లూరు స్థానిక శాంతినగర్ కు చెందిన కిన్నెర ఆనందరావు-పుష్పలత (ఆర్టీసీఆనంద్) దంపతులు స్ఫూర్తి ఫౌండేషన్ వారు పేద విద్యార్థుల కొరకు తలపెట్టిన ఒక పలక ఒక బలపం ఒక నోట్ పుస్తకం. కార్యక్రమానికి స్పందించి తమ వంతు సహాయంగా 65 నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లను మంగళవారం ఫౌండేషన్ ప్రతినిధి వరకా రామారావుకి కల్లూరు లో కార్యాలయము నందు అందించడం జరిగింది. ఒక విద్యార్థికి అవసరమైనా ఒక పుస్తకం అందిస్తూ ఆ విద్యార్థి ఉన్నత స్థానానికి ఎదిగి పేదరికంలో ఉన్న నలుగురికి సహాయం అందించాలి, అనే ఉద్దేశ్యంతో అందించారు. విజ్ఞానంతోనే అజ్ఞానాన్ని తొలగించే కార్యక్రమానికి పునాదులు వేస్తున్న స్ఫూర్తి ఫౌండేషన్ వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. మానవ సేవే మాధవ సేవా అనే ఆలోచనతో ఒక మంచి కార్యక్రమానికి సహాయం చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఇలాంటి గొప్ప సహాయాన్ని అందించిన కిన్నెర ఆనందరావు కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు ఉబ్బన బాబురావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భువనగిరి జిల్లా జోడో అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా ఎండి మహమ్మద్



**భువనగిరి, ఆగష్టు 5 (జనంసాక్షి)** యాదాద్రి భువనగిరి జిల్లా జూడో అసోసియేషన్ జాయింట్ సెక్రెటరీగా ఎండి మహమూద్ ని మరియు వైస్ ప్రెసిడెంట్ గుజ్జ బాల్ లింగం ని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు బి కైలాష్ యాదవ్ మరియు రాష్ట్ర జూడో అసోసియేషన్ కార్యదర్శి ఎంఏ అజీజ్ ఫారూఖ్ ఈ బాధ్యతలను అప్పగించారు. భువనగిరి మండల జాయింట్ సెక్రటరీగా ఎండి మహమూద్ వైస్ ప్రెసిడెంట్ గా గుజ్జ బాల్ లింగం ని నియమించినందుకు రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు మరియు కార్యదర్శి కి అలాగే యాదాద్రి భువనగిరి జిల్లా జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఫరూక్ కి అధ్యక్షులకి అభినందనలు తెలియజేసారు. మాకు అప్పగించిన ఈ బాధ్యతని సక్రమంగా నిర్వహిస్తామని భువనగిరి మండలంలోని విద్యార్థిని విద్యార్థులకు జూడో లో మంచి ప్రావీణ్యం కల్పించి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ విద్యార్థులను అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేసారు.

# బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

**42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు వెంటనే పార్లమెంట్లో చట్టం చేయాలి**

**బీసీ రిజర్వేషన్లపై నోరు మెదపని బిజెపి పార్లమెంటు సభ్యులు వెంటనే రాజీనామా చేయాలి : సిపిఎం డిమాండ్**



**వలిగొండ ఆగస్టు 5 (జనం సాక్షి):** దేశవ్యాప్తంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసేందుకు పార్లమెంటులో వెంటనే చట్టం చేయాలని బీసీ రిజర్వేషన్ల అమలుపై నోరు మెదపకుండా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న బిజెపి తెలంగాణ ఎంపీలు వెంటనే రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మద్దెల రాజయ్య, మండల కార్యదర్శి సిర్పంగి స్వామి లు డిమాండ్ చేశారు. మంగళవారం రోజున వలిగొండ మండల కేంద్రంలోని భువనగిరి నల్గొండ రహదారిపై సిపిఎం ఆధ్వర్యంలో 42 శాతం బీసీ రిజర్వేషన్లను వెంటనే పార్లమెంట్లో చట్టం చేసి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్దెల రాజయ్య,సిర్పంగి స్వామి లు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం 42 శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడడం బిజెపి మనువాద భావజాలానికి నిదర్శనమని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న మనువాద భావజాలాన్ని ప్రజలందరూ అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు మెరుగు వెంకటేశం, కూర శ్రీనివాస్, కందడి సత్తిరెడ్డి, వాకిటి వెంకటరెడ్డి, మండల కమిటీ సభ్యులు మొగిలిపాక గోపాల్,కర్ణ కంటి యాదయ్య, కల్కూరి ముత్యాలు, దుబ్బ లింగం, కవిడే సురేష్, భీమనబోయిన జంగయ్య, భూమి మాధవి,పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,భూమి బాల శంకర్, మద్దెల మారయ్య,పట్టణ నాయకులు కొండూరు సత్తయ్య, వేముల నాగరాజు, మైసొల్ల నరేందర్, తదితరులు

# ఐటిఐ లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**కళాశాల ప్రిన్సిపాల్ ధర్మచారి**



**బూర్గంపహాడ్ ఆగష్టు 05 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మడలం కృష్ణసాగర్, భద్రాచలం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు కృష్ణసాగర్ కళాశాల ప్రిన్సిపాల్ ధర్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆగష్టు 2025 సేషన్ కొరకు ఎన్ సి వి టి ప్యాటర్న్ క్రింద వివిధ ఇంజనీరింగ్ మరియు నాన్ - ఇంజనీరింగ్ ఐటిఐ %డ% ఏ టి సి ట్రేడ్స్ లలో శిక్షణ పొందటానికి ప్రభుత్వ ఆర్.ఐ.టి.ఐ. భద్రాచలం, కృష్ణసాగర్ నందు మొదటి దఫా, రెండవ దఫాలో మిగిలిన సీట్ల కొరకు Walk in Admission కు ఆగస్టు 06వ తేదీ నుండి 2025 ఆగస్టు 28వ తారీకు వరకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు Walk in Admissionకౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయనన్నారు. https://telangana.gov. in వెబ్ సైట్ లో నిజ ధ్రువపత్రాల ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతి రోజు హాజరైన అభ్యర్థుల మెరిట్ ప్రతిపాదికన మాత్రమే సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. సీట్లు పొందాలనుకునే వారు నిర్ణీత సమయంలో ఐటిఐ రిజిస్ట్రేషన్ ఫారం, వర్జినల్ సర్టిఫికెట్స్ ఎస్ ఎస్ సి లాంగ్ మెమో, కుల ధృవీకరణ పత్రం, 1 to 10" వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీ సి సర్టిఫికెట్స్ తో హాజర వ్వాలన్నారు. ఇంతకుముందు అప్లై చేసుకోని అభ్యర్థులు కొత్తగా ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని, అయితే ఇప్పటికే నమోదు చేసుకున్న అభ్యర్థులు మళ్లీ నమోదు చేసుకోనవసరం లేదని, సదా అవకాశమును అర్హులైన అభ్యర్థులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.



# రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

**మధిర, ఆగస్టు 05 జనం సాక్షి:** ఏదైనా ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడిన వారమవుతామని పలువురు అన్నారు. మంగళవారం మధిర ప్రభుత్వ ఆసుపత్రి నందు లైఫ్ ఆఫ్ గివింగ్ ఫౌండేషన్ చైర్మన్ ఎండి పై మూన్ వారి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అనిల్ కుమార్ ప్రారంభించడం జరిగినది. ఈ శిబిరానికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కుంచం కృష్ణారావు హాజరై శిబిరంలో 59 వ సారి రక్తదానం చేయడం జరిగినది. ఈ రక్తదాన శిబిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం డిస్ట్రిక్ బ్రాంచ్ వారి ఆర్థిక సహకారంతో పండ్లు, కూల్డ్రింక్స్, బిస్కెట్స్, వాటర్ పంపిణీ చేయడం జరిగినది. ఈ యొక్క రక్తదాన శిబిరంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఖమ్మం డిస్ట్రిక్ బ్రాంచ్ సెక్రటరీ సూర్యప్రకాశరావు, కోఆర్డినేటర్ గజేంద్రుల నాగేశ్వరరావు, మేనేజింగ్ సభ్యులు జల్లా వెంకటేశ్వర్లు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్ తెలంగాణ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ జి. డేనియల్ రాజు, కోన సత్యనారాయణ గుప్తా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కోన నరసింహారావు , కోమటిడి శ్రీనివాసరావు గార్లు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి



**మేళ్లచెరువు, (జనంసాక్షి):** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని క్లస్టర్ కోఆర్డినేటర్ శిరీష అన్నారు. సోమవారం నవజీవన్ బాల భవన్ స్వచ్ఛంద సంస్థ, చైల్డ్ హెల్ప్ లైన్ నెట్ వారి ఆధ్వర్యంలో మేళ్లచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ఏఎన్ఎం, ఆశాలు, సిబ్బంది సమక్షంలో సైబర్ క్రైమ్ గురించి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ అమాయ కత్వంతో మోసపోతున్నారని తగిన జాగ్రత్త లేకపోతే మోసపోవడం జరుగుతుందని, ఫోన్ పే, గూగుల్ పేలో కొంత అమౌంట్ ఆడ్ అయిందని మెసేజ్ వస్తే మెసేజ్ ని డిలీట్ చేయాలని, రాంగ్ పిన్ కోడ్ అని, వాళ్ళు పంపిన మెసేజ్ క్యాన్సిల్ అవుతుందని, మన అమౌంట్ మనకే ఉంటుందని అంటారు. ఫోన్ హ్యాక్ అవకుండా ఉంటుందని అంటారు. అపరిచితుల ఫోన్ కాల్స్ స్పందించకూడదని (డిజిటల్ క్రైమ్ )పోలీస్ ఆఫీసర్ గానీ, బ్యాంకు మేనేజర్ గాని ఫోన్ వీడియో కాల్ చేసి బెదిరించడం వంటివి చేస్తే తక్షణమే పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలని, అలాంటి ఫోన్ కాల్స్ ని భయపడకూడదని ఎలాంటి సమాచారాన్ని చెప్పకూడదని తద్వారా అనర్థానికి దారితీస్తుందని, ఫోన్ కు ఎక్కువ అలవాటు కాకుండా లిమిట్స్ లో వాడాలని సూచించారు. ఈ ప్రోగ్రాం లో గైనకాలజిస్ట్ సీతామాలక్ష్మి, మమత, రషీద్, రాజశేఖర్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కనుమరుగవుతున్న పల్లె కళల

# కన్నీటి గాథలు



- ○ జీవితం కోసం పోరాడుతున్న జానపద కళాకారులు
- ○ వేదికలు మాయమైపోయాయి
- ○ కళాకారులు అస్తిత్వం కోసం పోరాటం

**మర్రిగూడ, ఆగస్టు 5 (జనంసాక్షి)**
ఒకప్పుడు పల్లె జీవితం కళతో ముడిపడిన జీవనశైలి. యక్షగానాలు, బుర్రకథలు, హరికథలు, డప్పు వాయిద్యాలు, గంగిరెద్దుల చిందులు, గొబ్బిల బజనలు, చిందు భాగవతాలు ె ఇవన్నీ గానకళలో ఓ భాగంగా, పల్లె సంస్కృతికి పునాది. కానీ ఈ రోజుల్లో వీటి స్థానం కనుమరుగవుతుంది . ఈ కళలు మరింత బాధాకరం ఏంటంటే ె వీటి వెనక ఉన్న కళాకారుల జీవితాలే చీకట్లోకి వెళ్తున్నాయి.

**పల్లె సంస్కృతి కళల రథం**
తెలంగాణ గ్రామాల్లో పండుగలన్నీ కళల నడకతో మొదలయ్యేవి. ఊరి చివర డప్పు వాయిద్యాలు మోగించుతూ, బుర్రకథ కళాకారులు పురాణ గాథలు వినిపించేవారు. యక్షగాన కళాకారులు వేషధారణలో ఊరి వీధుల మధ్య తిరుగుతూ పిల్లల నుంచి పెద్దల వరకు అందరినీ అలరిస్తారు. హరికథ చెప్పేవారు దైవగాథల్లో తడిసి ముద్దవై, ప్రేక్షకుల్ని మంత్రముగ్దులను చేస్తారు.
ఈ కళలు కేవలం వినోదం కోసం కాదు ె అవి ప్రజల్లో నైతికతను, చరిత్ర పట్ల గౌరవాన్ని, పరస్పర అనుబంధాన్ని పెంచేవి. ఒకరి జీవితాన్ని స్పర్శించే శక్తి కలిగిన కళలివి.

**బుర్రకథ కళాకారులు**
వినోదంలో వినిపించే బాధ ఒకప్పుడు గ్రామంలో జాతర వస్తే, ఊరంతా ఒక్కచోట చేరేది. "బుర్రకథ బుర్రకథ!" అంటూ ఓ గొంతు వినిపించేది. వేషాలు వేసుకున్న బుర్రకథాకారుడు, చెక్కబొమ్మ చేత పట్టుకుని పురాణ గాథలతో నవ్వులు, జ్ఞానం నింపేవాడు.కానీ ఈరోజుల్లో ఎవ్వరూ వినరని వేదన ఉంది.నాకు పది కథలు వచ్చుతాయి, కానీ ఎవ్వడూ పిలవడు. ఒక్క జాతరలోనైనా అవకాశం వస్తే కుటుంబాన్ని పోషించగలిగేవాడిని. ఇప్పుడెవ్వరో డీజే పెట్టి గోల చేస్తారు. మా కళ గళచించేస్తున్నారు!"అంటున్నాడు బుర్రకథ కళాకారుడు .

**భాగవత కళాకారులు**
మత పరంపరకు దారి, కానీ మార్గం కనిపించదు
పద్యాల రూపంలో భాగవత కథలు చెప్పడం ె ఒకటి రెండు గంటలు కాదు, కొన్ని రోజులపాటు సాగేది.
ఈ కళకు అనుభవం, శ్రద్ధ, భక్తి అవసరం. కానీ ఇప్పుడు విన్నే వారు లేకపోవడం వల్ల, ఈ కళ మౌనమవుతోంది.
తల్లి చేత నేర్చుకున్న భాగవత కథలు - ఇప్పుడు నా పిల్లలకు చెప్పినా, వాళ్లకు ఇంటర్నెట్ రీల్స్ ఎక్కువ ఆసక్తి!"
అంటున్నాడు , ఓ వృద్ధ భాగవత కళాకారుడు.
బాగోత కళాకారులు – పల్లె ప్రజల దారిదీపం, ఇప్పుడు మూలకుళంలోఈ కళలో కథలు చెప్పడం మాత్రమే కాదు %–% కాసేపు నవ్వించటం, ఇంకొంచెం పాఠం చెప్తూ జ్ఞానం నింపటం కూడా ఉండేది.సామాజిక సమస్యల్ని రంగులలో చూపించే ఈ కళ %–% ఇప్పుడు ఊరి చివర వదిలిపెట్టబడ్డ ఓ చెక్కపట్టీలా మారింది.పదేళ్లకే మొదలుపెట్టిన బాగోతం ఇపుడు నా కుమారుడు హైదరాబాదులో జొమాటో చేస్తాడు, నాకు మాత్రం ఎవరూ గుర్తించరు.అంటున్నాడు బాగోత కళాకారుడు

**యక్షగాన కళాకారులు - రంగుల వెండి తెర, అయినా నిర్గమమున్నదెక్కడ?**
వేషధారణలో విలక్షణంగా కనిపించే యక్షగాన కళాకారులు ఓ రాత్రి నాటికే వంద పాత్రలు ధరించగలవారు. మహాభారత, రామాయణ ఇతిహాసాల్ని రూపురేఖలతో అద్భుతంగా ప్రజల ముందుంచేవారు. ఇప్పుడు మాత్రం వీరికి వేషాల కన్నా పనివేషాలే మిగిలాయి.ఊరికి పండుగ అంటే మా వేషధారణ ముందు పిల్లలు ఫోటోలు తీయించేవారు. ఇప్పుడు వాళ్లకే కాస్తుమ్స్ లేవు, ఓన్లీ ఇన్స్టాగ్రామ్ ఫిల్టర్స్"
అని దుఃఖిస్తున్నాడు యక్షగాన కళాకారుడు
డప్పు వాయిద్య కళాకారులు – మోగే శబ్దం లేదు, మిగిలినది మౌనం డప్పు మ్రోగితే ఊరంతా కళలో మునిగిపోయేది.
పల్లె నాదానికి ప్రాణం అయిన ఈ డప్పు కళాకారుల పరిస్థితి ఇప్పుడు చాలా దారుణంగా ఉంది.
నా డప్పు నన్ను పోషించేది. ఇప్పుడు అదే పడి ఉంది. ఊరి పెళ్లిళ్లకు డీజే బుక్ చేస్తున్నారు. మా డప్పు మౌనమైపోయింది." అన్నాడు ఓ యువ డప్పు కళాకారుడు.
లిగంగిరెద్దుల కళాకారులు – ఊరికి మేళాలు పూసేవారు, నేడు మేఘాలు కమ్మిన దారులులి
గంగిరెద్దుల కళకారులు – ఊరి చివర వరకూ వచ్చి, మెల్లగా శుభాకాంక్షలు పలికేలా వేషధారణలో మెరిసిపోయేవారు.
ఈ కళలో దేవుడి అనుకూలతను తీసుకురావాలన్న విశ్వాసం ఉంది. కానీ ఇప్పుడు ప్రజల దృష్టిలో ఇది జడపనిగా మారింది.
ఇప్పుడు మా బిడ్డలకు ఈ కళ చెపితే... 'సిగ్గేస్తుందన్నా!' అంటారు. ఇంతకంటే మన బతుకంత అవమానం?"
అంటూ కన్నీళ్లతో చెప్పాడు గంగిరెద్దుల కళాకారుడు
లిజీవితం కోసం పోరాడుతున్న జానపద కళాకారులులి
ఇక ఆ కళ మిగిలిందా అన్నమాటే లేదండి. ఇప్పుడేం చేస్తాం... పంట సీజన్లో కూలి చేస్తాం. కొడుకు మాత్రం ఫోన్ పట్టుకుని సీరియల్లు చూస్తుంటాడు."
పల్లె రాత్రుల్లో బజనలు ఉండేవి. ఇప్పుడు ఆ స్థలాల్లో డీజే మ్యూజిక్ వస్తోంది. మా గొంతుకే వినిపించట్లేదు."
మా తండ్రి ఊరిలో బాగోతం చెప్పేవాడు. నేను కూడా నేర్చుకున్నా. కానీ ఇప్పుడేమీ అడగరు. ఇంటి ముందే డప్పు పెట్టి దుమ్ము తుడుస్తూ జీవితం సాగిస్తున్నాం" జానపద కళాకారుడు

**కళా జీవుల వెలితి - వేదికల కోసం ఆశలు**
ఈ కళాకారులందరికి ఒకే కోరిక – తమ కళకు గౌరవం, జీవనాధారం. నెలవారీ ఆదాయం, పింఛన్, పిల్లల చదువుకు స్కాలర్షిప్, గ్రామాల్లో వేదికలు ె ఇవే కావాలని కోరుకుంటున్నారు.
ప్రభుత్వాలు "కళల దినోత్సవాలు", "జానపద ఉత్సవాలు", "స్థానిక కళల సంరక్షణ ప్రణాళిక"లు రూపొందించాలి. స్థానిక సంస్థలు, ఎంసీపీలు, కలెక్టర్లు ె వారికీ కనీస జీవన మౌలిక సదుపాయాలు కల్పించాలి.

**ప్రజల బాధ్యత ె కళను బ్రతికించే పదాలు**
కళలు మన సంప్రదాయ శ్వాస. వాటిని నిర్లక్ష్యం చేయడం అంటే మన మూలాల్ని మర్చిపోయినట్లే.
మీ ఊరిలో ఉన్న కళాకారులను గుర్తించి, వారి ప్రతిభకు వేదిక కల్పించండి. ప్రతి పండుగకు, జాతరకు, స్కూల్ కార్యక్రమాలకు, ప్రభుత్వ సమావేశాలకు %–% స్థానిక కళాకారుల్ని ప్రాధాన్యం ఇవ్వండి.

**నేటి వాస్తవం : మౌనమౌతున్న గళాలు**
కాలం మారింది. టీవీ, మొబైల్, ఇంటర్నెట్ వచ్చాక వినోదానికి కొత్త మార్గాలు వచ్చాయి. అయితే, గ్రామీణ కళాకారుల జీవితం మాత్రం ఆ డిజిటల్ శబ్దాల్లో నెమ్మదిగా కరిగిపోయింది.

**అర్ధరాత్రి కలలు -కళాకారుల అబద్దపు ఆశలు**
వీరిలో చాలామంది కళాకారులు చదువు లేకపోయినా – కళలో జీవితాన్ని చూసినవారు. తమ పిల్లలకు కళ నేర్పించాలనుకున్నా, ఇప్పుడు వారు సినిమాలు, టిక్టాక్, రీల్స్ వైపు పరుగులు పెడుతున్నారు.
వేదికలు లేక, ప్రోత్సాహం లేక, ఆదాయం లేక, పెన్షన్ కానిచ్చేవారెవ్వరూ లేక ె కళకారులు మానసికంగా, ఆర్థికంగా కుదేలవుతున్నారు. తిండికోసం వీధుల్లో పని చేసేవారయ్యారు. కళ కళగా మిగలకుండా%ౌ% ఓ భారం అయింది.

**ప్రభుత్వం, ప్రజల బాధ్యత : ఆశల వెలుగరాసు**
ఇది ఓ నైపుణ్య హింస. కళలను ప్రోత్సహించకపోవడం వల్ల ఒక జీవనవిధానమే అంతరించిపోతోంది. ప్రభుత్వం కళాకారుల్ని గుర్తించాలి. వారికి నెలవారీ ఆదాయం, పింఛన్లు, నివాస స్థలాలు కల్పించాలి. నూతన కళామండలులు ఏర్పాటు చేసి గ్రామస్థాయిలో వేదికలు ఏర్పాటు చేయాలి."

**కలలు తిరిగి మోగాలి: డప్పు మళ్లీ మ్రోగాలి**
ప్రతి కళా వేదిక ఓ కళాకారుని ప్రాణవాయువు. ఆయన కళనే కాదు, గౌరవాన్ని కూడా పోషిస్తుంది. కళ కళగా పునర్జీవించాలంటే ె ప్రభుత్వ ప్రోత్సాహం మాత్రమే కాదు, ప్రజల ఆదరణ కూడా కావాలి. పల్లె మనిషి పల్లె గళాన్ని వినాలి.







# భువనగిరి పట్టణ అభివృద్ధికి పోరాటాలే మార్గం



## సిపిఐఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి జహంగీర్

**భువనగిరి, ఆగస్టు 5(జనంసాక్షి)**
భువనగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తిరందాస్ గోపి ట్రస్ట్ హాల్లో రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా మాట్లాడుతూ భువనగిరి పట్టణజిల్లా కేంద్రమైన అభివృద్ధి లో వెనకబడి ఉంది .గత బి ఆర్ ఎస్ నేడు కాంగ్రెస్ పాలకులు భువనగిరి అభివృద్ధికి పనిచేయడం లేదు. ఆగస్టు ,సెప్టెంబర్ మాసాలలో పట్టణ సమస్యలపై ప్రజా పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలి అని అన్నారు . భువనగిరి పట్టణంలో ఇంతవరకు టౌన్ హాల్ లేదు ,రైల్వే స్టేషన్ ఆధునీకరణ లేదు ,చాలా ఎక్స్ప్రెస్ రైలు ఆగడం లేదు .బస్టాండు అద్వాన స్థితిలో ఉన్నది అన్నారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది .భువనగిరి కిల రోప్ వే పనులకు అతి గతి లేదు ,ఇంటి స్థలాల సమస్య తీవ్రంగా ఉంది డబుల్ బెడ్ రూమ్ లు ప్రారంభించడం లేదు .పట్టణ సుందరీకరణకు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదు. భువనగిరి పట్టణ అభివృద్ధిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి అన్నారు .అదే విధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు .35 వార్డులలో ఉన్న సమస్యలపై సిపిఎం పార్టీ పోరుబాట ద్వారా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, సీనియర్ నాయకులు గద్దె నరసింహ, పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ ,పట్టణ కార్య వర్గ సభ్యులు గంధ మల్ల మాతయ్య, బందెల ఎల్లయ్య ,వనం రాజు, కల్లూరి నాగమణి ,బర్ల వెంకటేశం , వల్దాసు అంజయ్య, దాసరి మంజుల ,పర్వత్ బాలకృష్ణ ,శాఖ కార్యదర్శి దిడ్డికాడి మైసయ్య, ఈర్ల రాహుల్ ,రియాజ్ ,కొత్త లక్ష్మయ్య ,కొత్త లలిత తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగుల రహిత సమాజం కోసం కృషి చేయాలి..

## లింగమూర్తి.. వైద్యాధికారి






**తుంగతుర్తి ఆగస్టు 5 (జనంసాక్షి) :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బంది నులిపురుగుల రహిత సమాజం కోసం కృషి చేయాలని రావులపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లింగమూర్తి అన్నారు. మంగళవారం రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో,ఆరోగ్య సిబ్బందికి ఆశా కార్యకర్తలకు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో మూడు వాటాదారుల విభాగాల సమన్వయం ప్రాముఖ్యత, మోతాదు వివరాలు, పరిపాలన విధానాలు మరియు మాప్-అప్ డే అమలు పద్ధతులపై సవివరంగా ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. 1-19 సంవత్సరాల పిల్లలు నివసించే, చదివే, ఆడుకునే మరియు పని చేసే ప్రదేశాలను గుర్తించి అల్బెండజోల్ మాత్రలు అందించాలని అన్నారు దీనివల్ల నులి పురుగుల నిర్మూలన సాధ్యమవుతుం దన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలు, కమ్యూనిటీ స్థలాల ను సందర్శించి

1-2 సంవత్సరాలు ½ అల్బెండజోల్ టాబ్లెట్
2-3 సంవత్సరాలు 1 పూర్తి టాబ్లెట్
3-19 సంవత్సరాలు 1 పూర్తి టాబ్లెట్

1-2 సంవత్సరాలు: ½ టాబ్లెట్‌ను 2 చెంచాల మధ్య చూర్ణం చేసి నీటితో పిల్లలకు మింగించాలన్నారు. 2-3 సంవత్సరాలు: 1 పూర్తి టాబ్లెట్‌ను 2 చెంచాల మధ్య చూర్ణం చేసి నీటితో మింగించాలి. 3-19 సంవత్సరాలు: 1 పూర్తి టాబ్లెట్‌ను నమిలి నీటితో మింగించాలి అని అన్నారు.ఆరోగ్యశాఖ ద్వారా: మాత్రల సరఫరా, పంపిణీ, రికార్డు నిర్వహణ, చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో రావులపల్లి పిహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆరోగ్య విస్తరణ అధికారి కె రవికుమార్ పిహెచ్‌ఎన్ టీకేఆర్ లక్ష్మి సూపర్వైజర్, ఎం ఎల్‌హెచ్‌పి డాక్టర్‌విజయ్ కుమార్, మౌనిక, సరిత, రమ్య హెల్త్ అసిస్టెంట్లు, గాజుల సోమన్న, యాదగిరి చారి, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న కారు..

## మహిళ అక్కడికక్కడే మృతి





**చౌటుప్పల్ ఆగస్టు 5(జనంసాక్షి ):** ప్రకాశం జిల్లాకు చెందిన ఒక కుటుంబం ఔటింగ్‌కి హైదరాబాద్ వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు.సిఐ మన్మధ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మధిరాల గోవిందమ్మ (64), ఆమె కుమారుడు మధిరాల ప్రవీణ్ కుమార్ (36), కోడలు మధిరాల సుమతి (28) ముగ్గురు కలిసి,సోమవారం రాత్రి 9 గంటల సమయంలో ఒంగోలు నుండి హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు కొత్తగా కొన్న స్కోడా వోక్స్వాగన్ కారు ద్వారా బయలుదేరారు.కాగా ఉదయం సుమారు 6 గంటల సమయంలో వారు బోర్లైగూడెం స్టేజి సమీపానికి చేరుకోగా, రోడ్డుపక్కన నిలిచిన లారీని ఎలాంటి హెచ్చరికలేకుండానే డ్రైవర్ నిలిపి ఉంచాడు.దాంతో ప్రవీణ్ కుమార్ కారు నియంత్రణ కోల్పోయి లారీని వెనుక నుండి ఢీకొన్నాడు.ఈ ప్రమాదంలో గోవిందమ్మకు ఛాతిలో తీవ్ర గాయాలు కావడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. కోడలు సుమతికి గాయాలయ్యాయి. మధిరాల నారాయణ ఫిర్యాదు మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# మైలాపురం గ్రామంలో మృగాళ్ల మారిన ఊర కుక్కలు

**గుర్రంపోడు: ఆగస్టు 5 (జనంసాక్షి)** గుర్రంపోడు మండలం మైలాపురం గ్రామంలో సింగం సత్తయ్య యాదవ్ రైతు తన మేకల దొడ్డిలో మేకల్ని ఉంచగా ఎవరు లేనిది చూసి గ్రామాలలో విచ్చలవిడిగా తిరిగే ఊర కుక్కలు దగ్గర దగ్గర 40,000 ఖరీదు చేసే మేకలని కరచి చంపాయి.సత్తయ్య కుటుంబం చాలా బాధపడుతూ కన్నీరు మున్నీరవుతున్నారు ప్రభుత్వం ఎలాగైనా ఈ యొక్క సత్తయ్యకి జరిగిన నష్టాన్ని పరిహారంగా ఆదుకోవాలని కోరుతున్నారు మైలాపురం గ్రామంలో విచ్చలవిడిగా కుక్కలు ఉండడంతో గ్రామ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. గ్రామంలో ఇంతకుముందు కూడా చిన్న పిల్లల్ని ముసలివారిని ఈ ఊర కుక్కలు కరిచి చాలా గాయాలు పాలు చేశాయి. అధికారులు వెంటనే స్పందించి ఈ కుక్కల బెడద నుండి గ్రామ ప్రజలను గొర్రెలని మేకలని కాపాడాలని కోరుతున్నారు.



## జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు

# నిర్మించి ఇవ్వాలి

### తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ షానూర్ బాబా

**భువనగిరి టౌన్, ఆగస్టు5 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద జర్నలిస్టులకు ఇండ్లు నిర్మించి ఇచ్చి వారిని ఆదుకోవాలని తెలంగాణ జర్నలిస్టు యూనియన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ బాబా అన్నారు. టి జేయు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ నిస్వార్థంగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని, ఇప్పటివరకు జర్నలిస్టులకు సొంత ఇల్లు లేక అద్దె గృహాల్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారని ఈ ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలు కేటాయించి ఇల్లు కట్టించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

# మాతృత్వం మహిళలకు దేవుడు ఇచ్చిన వరం



**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):** మాతృత్వం మహిళలకు దేవుడు ఇచ్చిన వరం అని వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డైమండ్ స్టార్ కేసీజీఎఫ్ రాచకొండ విజయలక్ష్మి తెలిపారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలాజీ కన్వెన్షన్ హాల్ లో సుధాకర్ విజన్ క్లబ్ ఆధ్వర్యంలో వాసవి వారి శ్రీమంతం వేడుక చూద్దాం రారండి అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 104 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాసవి డిస్ట్రిక్ట్ 104ఏ ను ఇంటర్నేషనల్ లో రెండవ స్థానంలో నిలిపినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఒక ఇంట్లో సీమంతం చేసుకోవాలంటే ఎంతో ప్రయాసతో కూడుకున్న పనిని, అలాంటిది ఒకేసారి 104 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతం నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.వాసవి క్లబ్ ల ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ చేస్తూ వారికి ఆర్థికంగా తోడ్పాటును అందిస్తుందని తెలిపారు. ఆగస్టు 8న సారె,చీర కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఫ్రెండ్షిప్ డే కార్యక్రమంతో పాటు మాజీ అధ్యక్షులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఐఈసీలు సింగరకొండ రవీందర్, తోట శ్యాంప్రసాద్, రావర్ల కమలాకర్ క్యాబినెట్ సెక్రటరీ కృష్ణ, ట్రెజరర్ వెంపటి శబరి, జోన్ వన్ చైర్మన్ చల్లా లక్ష్మయ్య, రీజియన్ చైర్మన్ మిరియాల సుధాకర్, విజన్ క్లబ్ ప్రెసిడెంట్ దాచేపల్లి సంధ్య, సెక్రటరీ వంగవీటి సుజాత, ట్రెజరర్ బుర్లే జ్యోతి, పలువురు ఐపీసీలు, సిడిపిఓ సుబ్బలక్ష్మి, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి జిల్లా జానపద-వీధి నాటకోత్సవాలను జయప్రదం చేయండి

## మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు






**రామన్నపేట, ఆగస్టు 5 (జనంసాక్షి):** రామన్నపేట పట్టణ కేంద్రంలో ఆగస్టు 20,21 జరిగే ప్రజానాట్యమండలి జిల్లా స్థాయి జానపద- వీధి నాటకోత్సవాలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ,జానపద-వీధి నాటకోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కే.జే భవన్ లో ప్రజానాట్యమండలి కళాకారులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరించి, అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా కళలు పోరాట ఆయుధాలని అనేక ఉద్యమాలకు కళాకారులే ముందుండి నడిపించడం జరిగిందని అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రామన్నపేటలో గ్రామీణ కళాకారులను జిల్లా వ్యాప్తంగా అనేక మందిని ఏకం చేసి జానపద జాతర నిర్వహించడం జరుగుతుందని, జానపద వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గ్రామీణ కళాకారులకు కనీసం గుర్తింపు లేదని వారికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించి సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వస్తున్న పాశ్చాత్య విష సంస్కృతి మూలంగా గ్రామీణ కళలు పట్టుతప్పుతున్నాయని విష సంస్కృతి నేటి యువత మెదళ్లను కబలిస్తుందని వాపోయారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జానపద వృత్తి కళాకారులు 20, 21 తేదీల్లో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జానపద వీధి నాటకోత్సవాల ఆహ్వాన సంఘం అధ్యక్షులు కూరెళ్ళ నరసింహాచారి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గంటెపాక శివకుమార్,ఈర్లపల్లి ముత్యాలు, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకుడు కందుల హనుమంతు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జల్లెల పెంటయ్య, ప్రజాసంఘాల నాయకులు బొడ్డుపల్లి వెంకటేశం, బల్గూరి అంజయ్య,వనం ఉపేందర్, బోయిని ఆనంద్,కల్లూరి నాగేష్, గొరిగె సోములు, తొలుపునూరి శ్రీనివాస్, ప్రజానాట్య మండలి మండల అధ్యక్ష,కార్యదర్శులు మేడి పృథ్వి, గంటపాక శ్రీకృష్ణ, నాగటి లక్ష్మణ్,మేడి ముకుంద, మునికుంట్ల లెనిన్, సాగర్ల శేఖర్, తుర్కపల్లి నరేష్, మజ్జూర్ సాయి, పుట్టల ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# దూపహాడ్ గ్రామంలో మెగా పశువైద్య శిబిరం

## పాడి రైతులకు దాన ప్యాకెట్ లను పంపిణీ చేస్తున్న జిల్లా పశు వైద్య అధికారి శ్రీనివాసరావు



**పెన్ పహాడ్ మండలం, ఆగస్టు 05 (జనం సాక్షి) :**
మెగాపశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకొని, అభివృద్ధి చెందాలని జిల్లా పశు వైద్య,పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు.శ్రీ సత్య సాయి సేవ ట్రస్ట్ సహకారంతో పశు సంవర్ధక శాఖ సూర్యాపేట, పెన్ పహాడ్ మండల పరిది లోని దూపహాడ్ గ్రామంలో మంగళవారం మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. ఇట్టి శిబిరంను జిల్లా పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస రావు ప్రారంభించారు.ఈ శిబిరంలో 55 గేదేలను,10 పశువులను పరీక్షించడం జరిగింది.20కేజీల ఖనిజ లవణం, 20లీటర్లు కాల్షియమ్ ను పాడి రైతులకు పంపిణి చేశారు.ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవ ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు వంకాయలపాటి సుబ్బారావు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ అనంతుల వెంకన్న,అనంతారం పశు వైద్యధికారి డాక్టర్ ఎర్రంశెట్టి కిరణ్ కుమార్, గడ్డిపల్లి,పొనుగోడు పశు వైద్యాధికారులు డాక్టర్ జయసుధ,డాక్టర్ శ్రీకాంత్,గోపాల మిత్రలు సైదులు,అలీ, నగేష్,వెంకన్న,సంస్థ సభ్యులు, పాడి రైతులు పాల్గొన్నారు.



# ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగించవద్దు

## సూర్యాపేట టౌన్ సీఐ వెంకటయ్య

**సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):**
చిరు వ్యాపారులు రోడ్లను ఆక్రమించి ట్రాఫిక్ కు ఇబ్బందులు కలిగించవద్దని పట్టణ సీఐ వెంకటయ్య సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట పట్టణ సీఐ వెంకటయ్య ఆధ్వర్యంలో పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం కుడకుడ రోడ్డులో పర్యటించి దుకాణదారుల బోర్డులు, ఇతర సామాగ్రి ఏర్పాటు చేయగా వాటిని తొలగించి మరోసారి పెడితే చర్యలు తప్పవన్నారు.ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వ్యాపారాలు నిర్వహించుకోవాలని అన్నారు.రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలిగించి పాదచారులకు, వాహనదారులకు ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించారు. పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి ఆక్రమణలను తొలిగించి ట్రాఫిక్ ఇబ్బందులను దూరం చేసిన పోలీస్, మున్సిపల్ సిబ్బందికి వాహనదారులు, ప్రజలు అభినందనలు తెలిపారు.

# మునిపంపుల ప్రభుత్వ ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చాలి

## ఆశ వర్కర్ల సమావేశానికి షెడ్డు ఏర్పాటు చేయాలి

## సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు జంపాల అండాలు



**రామన్నపేట, ఆగస్టు 5 (జనంసాక్షి):**
మునిపంపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సౌకర్యం అందేలా చేసి పరిసర గ్రామాల గర్భిణీ స్త్రీల ప్రయోజనార్థం గైనకాలజిస్టును నియమించి వైద్య సౌకర్యం అందించాలని సిపిఎం మండల కార్యదర్శివర్గ సభ్యురాలు జంపాల అండాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ మహిళా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 20 సంవత్సరాల క్రితం ఏర్పడిన ప్రభుత్వ ఆసుపత్రిలో 24 గంటల వైద్య సౌకర్యం లేక పరిసర గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సుమారుగా 14 గ్రామాలకు కేంద్రమైన ప్రభుత్వాసుపత్రిలో ఒకే డాక్టరు ఉండడంతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదన్నారు. మండల కేంద్రం దూరంగా ఉండడంతో అత్యవసర వైద్యం కలిగినప్పుడు రాత్రిపూట ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని అన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ఫర్నిచర్ వంటివి కూడా లేక ఇబ్బందులు పడుతున్నారని, డాక్టర్ సొంత డబ్బులతో ఖర్చు పెట్టి కొనుక్కుంటున్నామని సమాధానం ఇస్తున్నారని అన్నారు. ప్రతి నెల ఆశా వర్కర్లు సమావేశం జరుపుతారు కనీసం కూర్చోవడానికి షెడ్డు లేకపోవడంతో చెట్ల కిందే కాలమెల్ల తీయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఖాళీగా ఉన్న నర్సు పోస్టును భర్తీచేయాలని, డాక్టర్లు నిరంతరం స్థానికంగా ఉండాలని అన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిని 24 గంటల ఆసుపత్రిగా మార్చి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని డిమాండ్ చేశారు. లేని పక్షం లో ప్రజలతో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మహిళా శాఖ నాయకులు తాళ్లపల్లి హేమలత,బొడ్డుపల్లి సంధ్య, కుక్కడపు ఎల్లమ్మ, అప్పం విజయ, గంటెపాక అశ్విని, బోనగిరి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే స్థానిక సంస్థల ఎలక్షన్లలో మార్పు చూపిస్తాం

## ఎస్ఎఫ్ఐ జాతీయ కమిటీ సభ్యులు ఖమ్మంపాటి శంకర్



**అడవిదేవుల పల్లి జనంసాక్షి (ఆగస్టు 05)**
భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ హాస్టల్ ల సంరక్షణ ప్రభుత్వ విద్యా పరిరక్షణ చేపట్టిన సంఘర్షణ సైకిల్ యాత్ర అడవి దేవులపల్లి కి చేరుకోవడం జరిగింది. అనంతరం ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ అడవి దేవులపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు త్రాగునీరు లేక మధ్యాహ్నం భోజనం రుచికరంగా లేక పోవడం తో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అర్థాకలితో క్లాస్ రూమ్ లో పాఠాలు వింటున్నామంటూ విద్యార్థులు అదేవిధంగా అడవిదేవులపల్లి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలకు చుట్టు ప్రహరీ గోడ నిర్మించాలని, సైకిల్ యాత్ర డిమాండ్ చేయడం జరిగింది.కానీ సంత భవనాలు కట్టించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల పట్ల సవతి తల్లి ప్రేమ చూపుతుందని అన్నారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు గత ఆరు నెలలుగా విడుదల చేయలేదంటే విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి వుందో అర్థమవుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ బెస్ట్ అవైలబుల్ స్కీం బిల్లులు సైతం బకాయిలో ఉన్నాయంటే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి విద్యార్థులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. కొన్ని యూనివర్సిటీలు పరిధిలో డిగ్రీ కాలేజీలు బకాయిలో ఉన్న స్కాలర్షిప్ విడుదల చేసేంతవరకు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించబోమని స్వయంగా కళాశాల యజమాన్యాలు ఆందోళన చేస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిద్ర పోతుందని ప్రశ్నించారు. నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సైకిల్ యాత్రలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు యాత్ర దృష్టికి వచ్చాయని ఇప్పటివరకు విద్యార్థులకు మరియు గురుకులాల్లో చదువుకునే విద్యార్థులకు యూనిఫామ్స్ ఇవ్వలేదని హాస్టల్లో కప్పు కుంటే అందుకు దుప్పట్లు లేక దోమలు కుట్టి విద్యార్థులు విషజ్వరంతో పడుతుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ మంత్రులు కనీసం విద్యార్థుల సంక్షేమం గురించి ఆలోచించకుండా మంత్రులు నిద్ర పోతున్నారా అని ప్రశ్నించారు. తక్షణమే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యా రంగ సమస్యలు పరిష్కారం చేయకుంటే కాంగ్రెస్ ప్రభుత్వన్ని గద్దె దించేందుకు విద్యార్థులను కూడా గట్టి బలమైన సమరశీల పోరాటాలకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కుర్ర సైదా నాయక్, కావ్య, స్పందన, కోరే రమేష్, ముస్కు రవిందర్ బుడిగ వేంకటేష్, మారుపాక కిరణ్, జగదీష్, జగన్ వీరన్న, రాకేష్, భార్గవ్ సాయి, తదితరులు పాల్గొన్నారు.



# ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**కొండమల్లేపల్లి, ఆగస్టు 5 (జనంసాక్షి):**
విద్యా, ఉపాధ్యాయ రంగంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని పెండింగ్ లో ఉన్న డిఎ, పిఆర్సీలను వెంటనే ప్రకటించాలని సోమవారం తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కట్టెబోయిన శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తపస్ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించి సభ్యత రసీదులను అందించారు. గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన డిఎ, పిఆర్సిలను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని ప్రభుత్వ ఉద్యోగులకు పదవి విరమణ అనంతరం రావలసిన బకాయిలు, జిపిఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తపస్ అధ్యక్ష కార్యదర్శులు కొమిరే సైదులు, బద్దెల అంజయ్య, బొమ్ము రవి, శ్రీనివాస్, నవీన్, నర్సింహ జ్యోతి, వరలక్ష్మి, మానస తదితరులు పాల్గొన్నారు.



# ఇంటింటికి బిజెపి మహా సంపర్క్ అభియాన్ ప్రారంభం

**కొండమల్లేపల్లి, ఆగస్టు 5 (జనంసాక్షి):**
భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ పిలుపుమేరకు మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల అధ్యక్షులు భూతరాజు భరత్ కుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 119 బూతులో ఇంటింటికి మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ మండల ప్రభారీ నక్క వెంకటేష్ యాదవ్ పాల్గొని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాలలో విఫలం చెందిందని భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోదీ ప్రభుత్వం గ్రామ పంచాయతీకి వచ్చే నిధులు, రేషన్ బియ్యం, బిజెపిలోని కేంద్ర ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న విశిష్ట పథకాల గురించి గడపగడప తిరుగుతూ ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గారంటీలతోపాటు బీసీ రిజర్వేషన్ అని బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ విమర్శించారు. ఈ కార్యక్రమ%శీ%లో జిల్లా కౌన్సిల్ సభ్యులు మల్లేష్ యాదవ్, బూత్ అధ్యక్షులు శీను, మండల నాయకులు యలిజాల శ్రీను, మల్లేష్, రమేష్ చంద్ర రమేష్ నాయక్, సయ్యద్ అలీ, చందు తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## యు.ఎస్. పి.సి యాదాద్రి జిల్లా కమిటీ



**భువనగిరి, ఆగస్టు 5 (జనంసాక్షి)** విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్ పీసీ) ఆధ్వర్యంలో దశలు వారి పోరాటాల్లో బాగంగా ఈ రోజు ముక్కెర్ల యాదయ్య, టి వీరభద్రం, జి లక్ష్మీనరసింహారెడ్డి అధ్యక్ష వర్గంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను వెంటనే పూర్తిచేయాలని, 5571 పిఎస్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి, పీఆర్సీనిప్రకటించి 1/7/2023 నుండి అమలు చేయాలన్నారు. పెండింగ్ డీఏ లను వెంటనే చెల్లించాలని, సీ పీఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 317 జీ ఓ వల్ల నష్టపోయినఉపాధ్యాయులందరినీ వారి సొంత జిల్లాలకు పంపించాలని, ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలను వెంటనేచెల్లించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు జీఓ 25 ను సవరించాలని, సమగ్ర శిక్ష ఉద్యోగుల 29 రోజుల సమ్మె కాలపు జీతాన్ని వెంటనే చెల్లించాలనీ, టైంస్కేల్ ఇవ్వాలని, వివిధ గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న గెస్ట్, పార్ట్ టైంఅవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కనీస వేతనం ఇవ్వాలని, నూతన జిల్లాలకు డీఈఓ పోస్టులను, ప్రతి రెవెన్యూ డివిజన్ కు డిప్యూటీ ఈఓ, నూతనమండలాలకు ఎంఈఓ పోస్టులను మంజూరు చేసి, ఉపాధ్యాయుల ఏకీకృతసర్వీసు రూల్స్ రూపొందించి, ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించ నట్లైతే ఆగష్టు 23 న హైదరాబాద్ లో రాష్ట్ర స్థాయి మహా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ధర్నా తదనంతరము జిల్లా కలెక్టర్ కి మెమొరాండం ఇచ్చారు. ఈ సమావేశంలో జిల్లా స్టీరింగ్ కమిటీ నాయకులు మెతుకు సైదులు , మైలారం సత్తయ్య, ఎస్ భాస్కర్, సి హెచ్ లక్ష్మి, ఎ వెంకటా చారి, శ్రీనివాసు, పొన్నాల సత్తయ్య, బి లింగయ్య, కె రాజగోపాల్, వెంకట్ రెడ్డి, జి లింగయ్య , సైదా రెడ్డి, ఎన్ వెంకటేశ్వర్లు, జనార్ధన్, బిక్షపతి, దశరథ, కె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలి

## సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 5(జనం సాక్షి:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని తక్షణం అమలు చేయాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్ చేశారు. మంగళవారం భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలోని సిపిఎం పార్టీ కార్యాలయం లో మండల పట్టణ విస్తృత స్థాయి సమావేశం మండల కార్యదర్శివర్గ సభ్యులు ప్రసాదం విష్ణు, పట్టణ కమిటీ సభ్యులు వడ్డేపల్లి యాదగిరి అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా నర్సింహ పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు అనేక వాగ్దానాలను ప్రజలకు ఇచ్చి కేవలం ఉచిత బస్సు పథకం తప్ప ఏ ఒక్కటి సంపూర్ణంగా అమలు చేయలేదని అన్నారు. బస్సు పథకం కూడా పట్టణాలకు తప్ప గ్రామీణ ప్రాంతాలకు బస్సులు పోయేది లేదని ఆ పథకము గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే పరిస్థితి లేదని తెలిపారు. అధికారం చేపట్టిన వెంటనే భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12 వేల రూపాయలు ఇస్తానని చెప్పి నేటికీ అమలు చేయలేదని అన్నారు. మరోపక్క వికలాంగులకు ఆరువేలు, వృద్ధులు వితంతువులు ఒంటరి మహిళలకు నాలుగు వేల రూపాయల చొప్పున పెన్షన్ పెంచి ఇస్తానని చెప్పి 20 నెలలు గడుస్తున్నా ఇవ్వడానికి ఏమీ ఇబ్బంది ఉన్నదని ప్రశ్నించారు. గత బి.ఆర్.ఎస్ ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం దళిత బంధు పేరుతో పది లక్షల రూపాయలు ఇస్తే నేను అధికారంలోకి వస్తే చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయాస్తం కింద 12 లక్షల రూపాయలు ప్రతి దళిత కుటుంబానికి ఇస్తానన్న వాగ్దానము వాగ్దానంగానే మిగిలిందని నర్సింహ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పథకాలు కాగితాల మీద బాగున్నాయని అమలులో మాత్రం అందరికీ అందడం లేదని అన్నారు. రెండు లక్షల రుణమాఫీ, అందరికీ ఇందిరమ్మ ఇల్లు అందడం లేదని కొందరికి ఇస్తే మరి మిగతా వారి పరిస్థితి ఎట్లా అని ప్రశ్నించారు. మహిళలకు నెలకు 2500 రూపాయలు, నిరుద్యోగ భృతి కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామాలలో రోడ్లు, మురికి కాలువలు, వీధిలైట్లు, మంచినీళ్లు లాంటి సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానిక సంస్థలు ఎన్నికలు పెట్టక సర్పంచులు లేక గ్రామాల అభివృద్ధి మొత్తం కుంటు పడ్డదని ఆవేదన వెలిబుచ్చారు. ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు తెలుసుకోవడం తప్ప అమలు చేసే పరిస్థితి లేదని విమర్శించారు. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల మొత్తం గ్రామాలలో, పట్టణాలలో పేరుకుపోయిన సమస్యల పరిష్కారం కోసం పోరుబాట పేరుతో నిర్వహిస్తున్న ఆందోళన, పోరాట కార్యక్రమాల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని నర్సింహ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి, పట్టణ కార్యదర్శి దుబ్బాక జగన్, మండల కార్యదర్శివర్గ సభ్యులు మంచాల మధు, అందెల జ్యోతి, మండల కమిటీ సభ్యులు నోముల కృష్ణారెడ్డి, పత్తి బిక్షపతి, నెలికంటి జంగయ్య, సామ జంగారెడ్డి, బోయపల్లి పుష్పలత, పట్టణ కమిటీ సభ్యులు బుగ్గ లక్ష్మయ్య, పోన్నమోని కృష్ణ నాయకులు కోట రమేష్, వాకిటి పద్మారెడ్డి, వారాల వీరారెడ్డి, కంజర్ల అశోక్ , బాత్క బిక్షపతి, పగిళ్ల గంగారెడ్డి, పగిళ్ల మల్లారెడ్డి, కోట భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నూతన సీఐ కి సన్మానించిన ఈద్గా కమిటీ

దేవరకొండ నూతన సిఐ గా బాధ్యతలు స్వీకరించిన పి.వెంకట్ రెడ్డి కి స్థానిక ఈద్గా మరియు ఈద్గా కాంప్లెక్స్, మక్కా మసీదు కమిటీ సభ్యులతో కలిసి కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీముద్దీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మొహమ్మద్ రహత్ అలీ,లు మంగళవారం శాలువలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పి. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజలు ప్రజాప్రతినిధుల సహకారంతో ఫ్రెండ్లీ పోలీస్ గా వ్యవహరించి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల భాగస్వామ్యంతో శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడతానని తెలిపారు. పోలీసులంటే ప్రజలతో స్నేహభావంతో మెలిగే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు కమిటీ జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఇలియాస్ పటేల్, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ ఖాజా మొయినోద్దీన్, వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ షబ్బీర్ ,సెక్రటరీ ఇలియాస్ బాబా, మహమ్మద్ అథీక్ పాల్గొన్నారు.

జనంసాక్షి @ దేవరకొండ

# కిచెన్ గార్డెన్ ప్రారంభోత్సవం విద్యార్థులకు ప్రకృతి తోడుగా



**పెన్ పహాడ్,ఆగష్టు 05 (జనంసాక్షి) :** మండల పరిధిలోనిఆదర్శ పాఠశాల, అనాజిపురం గ్రామంలో ఓ ప్రత్యేక విద్యా కార్యక్రమంగా కిచెన్ గార్డెన్ ప్రారంభోత్సవం నిర్వహించబడింది. ఈ సందర్భంగా గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు డి. ఆదర్శ్ (సైంటిస్ట్, ప్లాంట్ ప్రొటెక్షన్) ఎం. సుగంది (సైంటిస్ట్, హొమ్ సైన్స్) పాఠశాల సందర్శించి విద్యార్థులకు పౌష్టికాహారం, ఇంటి తోట పెంపకం,ధాని ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాలకూర, తోటకూర, గోంగూర, టమాట, సొరకాయ విత్తనాలతో పాటు మిరప, వంకాయ, టమాట మొక్కలను పాఠశాల విద్యార్థులకు అందించారు. కిచెన్ గార్డెన్ కోసం కేటాయించిన స్థలాన్ని 5X5 గజాల పరిమాణంలో అనేక బ్లాకులుగా విభజించి, ఒక్కొక్క బ్లాకును ఒక తరగతికి కేటాయించారు. ప్రతి తరగతి తమ బ్లాక్‌లోని మొక్కల పర్యవేక్షణ, నీటి సరఫరా, సంరక్షణకు బాధ్యత వహించవలసిందిగా సూచించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కోడి లింగయ్య మాటాడుతూ,ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు కూరగాయల పెంపకం, మొక్కల సంరక్షణ, అధునాతన వ్యవసాయ పద్ధతులపై ప్రాక్టికల్ అవగాహన పొందుతారు. ఇది విద్యార్థిని, విద్యార్థుల విజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా ప్రకృతితో అనుబంధాన్ని పెంచుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.సోమయ్య, యూత్ అండ్ ఎకో క్లబ్ ఇన్చార్జి యం.లక్ష్మీనారాయణ, ఎకో క్లబ్ సభ్యులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు. ప్రకృతి ప్రేమ, ఆహార భద్రత, ఆరోగ్యవంతమైన జీవితాన్ని లక్ష్యంగా పెట్టుకున్న, ఈ కార్యక్రమం పాఠశాల విద్యార్థులకు శాశ్వత స్ఫూర్తిగా నిలిచే అవకాశంగా కల్పించారు...

# కొమ్మాయిగూడెంలో బిజెపి మహా సంపర్క్ అభియాన్



**రామన్నపేట, ఆగస్టు 5 (జనంసాక్షి):** మండలంలోని కొమ్మాయిగూడం గ్రామంలో బిజెపి మహా సంపర్క్ అభియాన్ లో భాగంగా ఇంటి ఇంటికి బిజెపి... ప్రతి ఇంటికి బూత్ అధ్యక్షుడు కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో 40, 41వ బూత్ లలో సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గడపగడపకు వెళ్లి 11 ఏళ్ల మోదీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలు అందుతున్నాయా లేదా తెలుసుకొని నరేంద్ర మోడీకి మద్దతుగా మొబైల్ ఫోన్ తో మిస్డ్ కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ ఇంచార్జ్ నకిరేకంటి మొగులయ్య మండల ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల ఇన్చార్జ్ తాటిపాముల శివకృష్ణ స్టేట్ కౌన్సిల్ మెంబర్ వనం అంజయ్య బిజెపి సీనియర్ నాయకులు బెల్లి లింగస్వామి, గోపగోని అశోక్, రేపాక లింగస్వామి, మచ్చ మహేష్, ఐలాపురం అశోక్, గురజాల నవీన్ రెడ్డి, మోరే రాజయ్య, వీరమల్ల వీరేష్, డాకోజి నాగరాజు, కంచి రమేష్, తీర్పాల మల్లేష్, వీరమల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

## జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు



**హుజూర్ నగర్, ఆగస్టు 05 (జనంసాక్షి):** ఈనెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం షాపూర్ నగర్ లో జరిగే సిపిఐ తెలంగాణ నాలుగవ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం హుజూర్నగర్ పట్టణంలోని సిపిఐ కార్యాలయం అనుమాల లింగయ్య భవన్ లో జరిగిన నియోజకవర్గస్థాయి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శిలు ప్రజాసంఘాల జిల్లా స్థాయి అధ్యక్ష కార్యదర్శుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పోరేట్ అనుకూల విధానాలతో ప్రజా వ్యతిరేక విధానాలు అమలు చేస్తూ రైతుల హక్కులను కాలరాసే విధంగా తెచ్చిన మూడు నల్ల చట్టాలను కార్మికుల హక్కులు హరించే నాలుగు కార్మిక కోడ్ లను విద్యా కార్పోరేటీకరణ చేసే కుట్రలో భాగంగా నూతన విద్యా చట్టాన్ని, అలాగే విద్యుత్ చట్టాన్ని టెలిఫోన్ చట్టాలు తేవడంతో పాటు ప్రభుత్వం రంగాన్ని నిర్వీర్యం చేస్తూ కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయడంలో దేశంలో నిరుద్యోగులను పెంచుతున్నారని ప్రజా పంపిణీ వ్యవస్థ రద్దుచేసి ప్రజా రవాణా రద్దు లాంటిఅనేక ప్రజా వ్యతిరేక విధాలపై కమ్యూనిస్టు పార్టీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. భారతదేశంలో 100 సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో మత సామరస్యం కోసం లౌకిక రాజ్యం కోసం నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీగా ఉన్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర మహాసభలు 19వ తేదీ కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం మహారాజా గార్డెన్స్ లో ప్రారంభం కాబోతున్నాయని ఈ మహాసభకు సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా తో పాటు నల్లగొండ మాజీ పార్లమెంట్ సభ్యులు సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి, డాక్టర్ కే నారాయణ పాల్గొని ప్రసంగిస్తారని ఆయన తెలియజేశారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యల్లావుల రాములు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలోఓ బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాల ధనుంజయ నాయుడు, గుండు వెంకటేశ్వర్లు దేవరం మల్లీశ్వరి, పోకల వెంకటేశ్వర్లు ,కందుల వెంకటేశ్వర్లు, ముళ్ళ జానయ్య, యల్లావుల రమేష్ పాల్గొన్నారు.

# 7న జాతరలో కొబ్బరి కాయల అమ్మకాని వేలం

**కారేపల్లి, ఆగష్టు05(జనంసాక్షి) :** దసరా సందర్భంగా కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లి కోటమైసమ్మ తల్లి అలయ ప్రాంగణంలో నిర్వహించే జాతరలో కొబ్బరికాయల అమ్మకానికి వేలం పాటను ఈనెల 7న నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభి రామారావు, ఈవో కొండకింది వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలు తెలిపారు. సెప్టెంబర్ 26 వ తేదీ నుంచి అక్టోబర్ 6వ వరకు 11రోజులు పాటు జరిగే జాతరలో కొబ్బరి కాయలు, పూజసామాగ్రీ అమ్మకాలకు గత నెల 17, 28 తేదిలలో వేలం పాటలు నిర్వహించగా పాటదారులు ముందుకు రాలేదు. దీంతో కొబ్బరికాయల వేలం వాయిదా పడింది. దీనికి సంబంధించి ఈనెల 7వతేదిన వేలం పాట నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

# అణగదొక్కపడుతున్న ఆదివాసీలు

## కార్పోరేట్ సంస్థలకోసం గిరిజన చట్టాలు మార్పు




**కారేపల్లి, ఆగష్టు05(జనంసాక్షి) :** అడవిని నమ్ముకోని జీవిస్తున్న ఆదివాసీలను పాలకులు అణగదొక్కుతున్నారని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు వజ్జా రామారావు విమర్శించారు. మంగళవారం కారేపల్లి మండలం ఎర్రబోడులో అదివాసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గూడెలలో అభివృద్ధికి దూరంగానే ఉంటున్నాయన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ ఉన్నా ఆ నిధులు పక్కదారి పడుతుండటంతో గిరిజన ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవటం లేదన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని అమలు చేయకుండా పారెస్టు అధికారులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అటవీ హక్కుచట్టంలో మార్పులు చేస్తూ అడవి నియమాలను తీసుకవస్తుందన్నారు.దీంతో అదివాసీలను అడవుల నుండి తరిమివేసి కార్పొరేట్ సంస్థలకు అటవీ సంపదను కట్టపెట్టాలని కుయుక్తులు పన్నుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో ఐటీడీఏ లేక పోవటంతో ఈ ప్రాంత గిరిజనులు సంక్షేమ పథకాలకు దూరం అవుతున్నారని ఆవేదనవ్యక్తం చేశారు. ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా హక్కుల దినంగా ప్రతి గిరిజన గ్రామంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కుర్సం భద్రకాళి, వజ్జా సామ్రాజ్యం, చరప ఈశ్వరి, వజ్జా అనంతమ్మ, వజ్జా లక్ష్మి, రత్నకుమారి, ఝాన్సీ, చరప సుశీల, వజ్జా లలిత తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ వైద్యులపై టీజీఎంసీ దాడులు ఆపాలి

**పారామెడికల్ బోర్డుద్వారా సర్టిపికెట్ శిక్షణ ఇవ్వాలి**

**7న సీజనల్ వ్యాధులపై గ్రామీణ వైద్యులకు అవగాహన**

**గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు**

**కారేపల్లి, ఆగష్టు05(జనంసాక్షి) :** పల్లెలో ప్రథమ చికిత్స అందిస్తూ ప్రజల మన్నలను పొందుతున్న గ్రామీణ వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) దాడులు చేయటం ఆపాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పిట్టల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం కారేపల్లిలో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం సమావేశం జరిగింది.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీజీఎంసీ అనుచితదాడులతో గ్రామీణ వైద్యులను భయభ్రంతలకు గురిచేస్తుందన్నారు. 2004లో వైస్ రాజశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ వైద్యులకు పారామెడికల్ బోర్డు ద్వారా శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు. దీనికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 65వేల మంది ధరఖాస్తులు చేసుకున్నారని దానిలో 55 వేల మంది అర్హులుగా తేల్చారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణంతో దానికి నిధులు కేటాయింపు లేక ఆ పక్రియ నిలిచిపోయిందన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పక్రియను కొనసాగిస్తుందని ఆశించామన్నారు. టీజీఎంసీ గ్రామీణ వైద్యులపై దాడి చేస్తున్న ప్రభుత్వం స్పందించక పోవటం విచారకరమన్నారు. క్వాలీఫైడ్ వైద్యులు పల్లెలో వైద్య సేవలు అందించటానికి ముందుకు రాక పోవటంతోనే ప్రజలు గ్రామీణ వైద్యులపై ఆధారపడుతున్నారన్నారు. గ్రామీణ వైద్యులను గ్రామీణులే రక్షించుకుంటారన్నారు.

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 7న సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిద్వారా గ్రామీణ వైద్యులకు అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. దీనికి అన్ని పార్టీల నాయకులకు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామీణ వైద్య సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతారపు వెంకటాచారి, కార్యదర్శి జీ. వెంకట్రామయ్య, మండల నాయకులు వీరయ్యచౌదరి, రఘు, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# మేమెంతో మాకంత వాటా దక్కాలి

## బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్

**సంస్థాన్ నారాయణపురం. ఆగస్టు5.(జనం సాక్షి):** బీసీలకు విద్య ఉద్యోగ రాజకీయ రంగాలలో మేమెంతో మాకంత వాటా తగ్గాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్ అన్నారు సమస్త నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో ఈ నెల ఏడవ తేదీన గోవా రాష్ట్రంలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్టేడియంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాదుల శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో చేపట్టిన అఖిలభారత 10 వ జాతీయ ఓబిసి మహాసభ పోస్టర్ను ఆవిష్కరించి మాట్లాడారు దేశవ్యాప్తంగా తక్షణమే బీసీ కులగనన నిర్వహించి జనాభా దామాషా ప్రకారం అన్ని రంగాల్లో బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పెంచిన 42% బీసీల రిజర్వేషన్లు బిల్లును తక్షణమే 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ గారి ఆధ్వర్యంలో ఆగస్టు ఏడవ తేదీన గోవా రాష్ట్రంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో అఖిలభారత పదవ జాతీయ ఓబిసి మహాసభను ఏర్పాటు చేశామని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బిసి సంఘ నాయకులు గజం శ్రీకాంత్ జోకు చిరంజీవి రావిరాల లోకేష్ కర్నాటి యాదగిరి వంగూరి సాయి జోకు శ్రీకాంత్ నడికుడి నాగరాజు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# పాలస్తీనా పసికందులపై ఇజ్రాయిల్ దాష్టికం



**కారేపల్లి, ఆగష్టు05(జనంసాక్షి) :** పాలస్తీనాపై ఇజ్రాయిల్ రాకెట్ దాడులతో పసికందులు,మహిళలు బలవుతున్నారని ఐద్వా మండల కార్యదర్శి కొండబోయిన ఉమావతి విమర్శించారు. పాలస్తీనాపై అమెరికా ప్రోత్సహంతో ఇజ్రాయిల్ దాడులను నిరసిస్తూ పాలస్తీనాకు సంఘీబావంగా ఐద్వా ప్రచారకార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా కారేపల్లిలో మంగళవారం ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. ఈసందర్బంగా కొండబోయిన ఉమావతి మాట్లాడుతూ పాఠశాలలో ఆసుపత్రులు జన సందోహాల పై యుద్ధ విమానాలు రాకెట్ దాడులు బాంబులు వర్షం కురిపిస్తూ ఇజ్రాయిల్ మారణ హోమం సఅష్టిస్తుందన్నారు. యుద్ధంలో ప్రజలు మృతి చెందటం, తినడానికి తిండి దొరకక ఆకలి చావులు పెరిగిపోతున్నాయన్నారు. ఇజ్రాయిల్ అమానుష్య చర్యలు ఖండిస్తూ పాలస్తీనా సంఘీభావంగా ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మంలో నిరసన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనిని జయప్రదం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు పచ్చిపాల గురులక్ష్మి, జూపల్లి లక్ష్మి, శ్యామల, రమ్య మౌనిక ఇతరులు పాల్గొన్నారు.